## కొత్త రచయితలు

# లవ్ స్టోరీ

# మౌనగీతం

ఆ రోజు ఆదివారం. సమయం పది గంటలయింది. ఎందుకో క్షణం కాలొక చోట నిలవడం లేదు. అక్కడకే ఆలస్యంగా నిద్రలేచాను.

కాసేపు అమ్మకి వంటలో సాయం చేశాను.

ఇల్లంతా నీట్‌గా సర్ది, పిల్లో కవర్స్, బెడ్‌షీట్స్ మార్చి ఇస్త్రీ చేశాను. స్నానం చేసి బ్రేక్‌ఫాస్ట్ చేసి టైము చూస్తే ఇంకా పది గంటల దగ్గరే ఉన్నాయి ముల్లు.

అసలైనా - ముఖ్యమైనది - ఎంతో ఇంపార్టెంట్ విషయం మర్చిపోయినట్టు - ఎందుకిలా వుంది!?

మదిలో మెదిలిన ఓ ఆలోచనకి పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

ఇంట్లో అందరూ టి.వి. ముందు కూర్చుంటే ఒంటరిగా గదిలో నాలు కుర్చీలో కూర్చుని వెనక్కి వాలాను. కళ్ళ ముందు ఏవో జ్ఞాపకాలు లీలగా.

*　　　　*　　　　*

ఎప్పటిలా బస్టాప్‌లో నిల్చున్నాను. కానీ ఆ రోజెందుకో ఎవరో నన్ను నిశితంగా గమనిస్తున్న భావన కలిగి ఓరగా తల తిప్పి చూశాను. ఓ ముసలాయన మధ్య మధ్య తల తిప్పి దొంగచూపులు చూస్తున్నాడు. అతను కాదు — ఇంకెవరో నన్ను గమనిస్తున్నారు అన్న ఆలోచనకే, శీతాకాలపు సాయంత్రం మంచుముక్కను తాకినట్టు శరీరమంతా చిరుప్రకంపన. రెండన వైపు చటుక్కున తలతిప్పి చూశాను. రెండడుగుల దూరంలో కాస్త వెనక్కి నిలబడున్నతను కంగారుగా చూపులు తిప్పుకున్నాడు.

అతని తడబాటు చూస్తే నవ్వొచ్చింది నాకు. అయినా ఆపుకున్నాను.

ఆ రోజే కాదు-అతను నన్ను గమనించటం అతని దినచర్యలో భాగంగా మారింది. ప్రతి రోజూ క్రమం తప్పక ఎక్సర్‌సైజు చేసినంత దీక్షగా — లెసన్ చదివినంత శ్రద్ధగా — తన కర్తవ్యాన్ని నెరవేరుస్తున్న సిన్సియర్ వర్కర్‌లా అతను నా కంటే ముందే బస్టాప్‌లో ప్రత్యక్షమవుతాడు.

అలా అని రోడ్‌రోమియో అనుకోవటానికి మన సొప్పటం లేదు. ఎంతో హుందాగా డ్రెస్ చేసుకొని గ్రేస్‌ఫుల్‌గా ఉంటాడు. రోజులు వారాలుగా — వారాలు నెలలుగా మారేసరికి నాక్కూడా అతనిపై ఇంట్రెస్ట్ పెరిగింది. అతనో క్షణం ఆలస్యంగా వస్తే నా కళ్ళు అతని కోసం వెతికేవి.

మనసులో ఏర్పడిన ఆ భావానికి ఏ పేరూ పెట్టలేదు. కానీ ఆదివారాలొస్తే మనసు కెంత చిత్రవధని! ఇది అని నిర్వచించలేని అనిర్వచనీయమైన భావాలు ఉత్తుంగ తరంగాల్లా లేచి ఘనను తుపాను నాటి సాగరంలా కల్లోలంగా మారిపోతుంది.

అసహనపు అణువణువూ –

డల్‌గా ఏదో కోల్పోయినట్టు –

జీవం లేని ఆదివారం తరిగిపోతుంటే మరునటి రోజు అతన్ని చూస్తానన్న భావం శరీరంలో నూతనోత్సాహాన్నిస్తుంది.

నయనాల సర్తనలో ఆరు నెలల కాలం అవలీలగా గడిచింది.

ఇప్పుడిప్పుడే ఒకరి నొకరు చూసి నవ్వుకునే స్థాయికి వచ్చాము.

అతని చూపుల్లోని ఆర్తి, ఆరాధనా భావం అర్థమవుతూనే వున్నా పలకరించే ధైర్యం చెయ్యలేక పోయాను.

కాలేజిలో ఉన్నా - చదువుతున్నా పదే పదే అతని రూపం కనుల ముందు కదులుతూ కాన్‌సన్‌ట్రేషన్ కుదరటం లేదు.

రోజులు గడిచే కొద్దీ అర్థమైపోయింది తన అసహనానికి కారణం. అతన్ని చూడకపోవడం వలనే తన శరీరంలో సగ భాగాన్ని కోల్పోయినంత ఆవేదన. ఒక్క రోజే చూడకుండా ఉండలేనిది జీవితాంతం ఎలా ఉండగలను!? అతని తోడులేని భవిష్యత్తు ఊహించుకుంటేనే నిస్సారంగా, చైతన్య రహితంగా, అర్థవిహీనంగా వుంది. డిగ్రీ ఇంకో నాలుగు నెల్లో కంప్లీట్ అవుతుంది. ఇంట్లోవాళ్ళు మ్యాచ్‌లు చూస్తున్నారు. పదని నిప్పి పేరైనా చెప్పని అతన్ని ఎలా అడుగుతుంది, నేనంటే మీ కిష్టమేనా అని - తీరా అడిగాక అతను నా కిష్టం లేదు పొమ్మంటే! అంతకంటే అవమానం ఏం కావాలి! మనసుని కంట్రోల్ చేసుకొని ప్రేక్షకురాలిలా చూస్తుండి పోయాను.

పెళ్ళివారి వివరాలు ఏవో చెప్పారు. నా బుర్ర కెక్కలేదు. 'నిన్ను చాలాసార్లు చూశారట - చూడక్కర లేదన్నా, మ్యాచ్ సెటిలైందన్నా విని ఊరుకున్నాను.

ఎగ్జామ్స్ నెల రోజుల్లోకి వచ్చాయి. ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చారు. డేట్ ఫిక్స్ చేశారు. కార్డ్స్ ఇవ్వటానికి ఫ్రెండ్స్ ఇంటికి బయలుదేరాను, అయిష్టంగానే.

అతన్ని చూడాలని ఉవ్విళ్ళూరుతున్న మనసుతో బస్టాప్ చేరుకునేసరికి నవ్వుతూ కనిపించాడతను ఎదురుగా. నాకో కొంటె ఆలోచన కలిగింది.

బ్యాగ్‌లో మంచి కార్డ్, పెన్ తీసి అతన్ని సమీపించాను. "యువర్ గుడ్ నేమ్ ప్లీజ్" మృదువుగా అడిగాననుకున్నాను - గొంతులో జీర తొంగి చూసింది.

"వంశీకృష్ణ" నవ్వుతూ చెప్పాడతను.

నేమ్ వ్రాసి కార్డ్ అందించాను. "కంగ్రాట్స్" అంటూ అందుకున్నాడతను.

అతని నవ్వు చూస్తుంటే వళ్ళు మండిపోయింది నాకు. విసురుగా ముందుకు కదిలి అప్పుడే వచ్చిన బస్ నెంబర్ కూడా చూడకుండా ఎక్కేశాను.

తను కార్డ్ ఇవ్వగానే విచారంగా ఫేస్ పెట్టి మీరంటే నా కిష్టం - మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. ఎలా చెప్పాలో తెలీక ఇంతకాలం ఆలస్యం చేశాను! అంటాడని ఏవేవో ఊహించుకున్నాను. నా ఊహల్ని తల్లక్రిందులు చేస్తూ అతని నవ్వు చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటే అశాంతిగానే గడిపాను. ఫ్రెండ్స్ జోక్స్ వేస్తున్నా నిరాసక్తంగా, మౌనంగానే కూర్చున్నాను. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి టేబిల్‌పై ఉన్న గులాబీ రంగు కవరుపై "శ్రుతి" అన్న ముత్యాల్లాంటి అక్షరాలు నన్నాకర్షించాయి.

అపరిచితమైన రైటింగ్ చూసి ఎవరై ఉంటారు అని, ఎంతో ఎగ్జయిటెడ్‌గా విప్పాను.

*డియర్ శ్రుతీ!*

నిన్ను ఇలా పిలిస్తే నీకు కోపమా. ఎప్పటి నుంచో నిన్ను చూస్తున్నాను. 'నువ్వు నా కంటో నచ్చావు' అని ఒక్క వాక్యంలో వ్రాసేస్తే ఆ మధురానుభూతిని ఖూనీ చేసినట్లే అవుతుంది.

ప్రతి ఉదయం నిత్య నూతనంగా నాలో ఉత్సాహాన్ని ఇంజెక్ట్ చేస్తుంది.

నిన్ను చూస్తాను అన్న భావనకే నాలో నరనర్ళు తొక్కే పులకరింపు.

మనసులో చెలరేగే భావ పరంపరకి వారధి లేనట్టే, నా ప్రేమను వ్యక్తం చెయ్యటానికి పదాలు దొరకలేదు.

ఉదయపు నీరెండలో నీ శరీరంపై పడిన కిరణాలు పరావర్తనం చెంది కాంతులీనుతూ మెరుస్తుంటే వాటి అదృష్టానికి నా కెంత జెలసీగా ఉంటుందో తెలుసా!

సాయంత్రం వాడిన పూలచెండులా అలసటతో నువ్వు కాలేజి నుంచి వస్తుంటే నిన్నలాగే ఒడిలోకి తీసుకుని సేదతీర్చాలని - ఏమేమో అనిపిస్తుంది. అసలు సుకుమార రాశియైన నా దేవతను అలా సాధారణ ఆడపిల్లలా బస్‌లో కాలేజికి పంపే మీ

పేరెంట్స్‌పై కోపం కూడా వస్తుంది.

ఒక్క రోజు నేను లేటుగా వస్తే నీ కన్నులలోని నిరీక్షణ నా కోసమేననే పిచ్చి నమ్మకం!

నన్ను చూడగానే వెలిగే నీ కన్నులలోని కాంతి రేఖలు - పెదవులపై దరహాస రేఖలు నేనంటే నీ కిష్టమేనని చెబుతున్నా ధైర్యం చెయ్యలేకపోయాను.

నిన్ను చూస్తుంటే అలా సమయంతో నిమిత్తం లేకుండా చూస్తూ ఉండిపోవాలనే ఆశ మొలకెత్తి బలీయంగా మారింది.

వేరులేని చెట్టుకున్న చిగురులా - నువ్వు నేను ఏకమవ్వాలని ఎంతో తపన నాలో!

యుగయుగాల విరహం తరువాత నే కోల్పోయిన నెచ్చెలిని, ప్రియతమ నేస్తాన్ని తిరిగి చూస్తున్న తియ్యని స్మృతి మదిలో రేకులు విప్పుకుంటుంటే–

మౌనంగా ఈ బాధ భరించలేక ఈ చిన్ని గుండె నిన్ను చేరకుండానే బద్దలవుతుందేమో అన్న భయంతో, మీ బ్రదర్‌ని కలిసి మాట్లాడాను. పెద్ద వాళ్ళు ఇష్టపడటంతో మ్యాచ్ సెటిలైంది. కానీ నా కర్థం కాని దొక్కటే!

కనీసం పెళ్ళికొడుకును చూడకుండానే, ఏ వివరాలూ తెలుసుకోకుండానే ఈ పెళ్ళికి నువ్వెలా ఒప్పుకున్నావ్?

ఆలోచిస్తుంటే అనిపించింది — ఇన్ని రోజుల నుంచి - దాదాపు సంవత్సరం పూర్తికావస్తున్నా మౌన వ్రతం చేసే పిరికి ప్రేమికుడిపై కోపంతో ఈ పెళ్ళికి అంగీకరించి వుంటావని.

ఇంకా సస్పెన్స్‌లో ఉంచితే ఎంతో అమూల్యమైన మధురానుభూతులను కోల్పోతామేమో అని నిజం చెప్పేస్తున్నా. నేనే డియర్ నీతో ఎంగేజ్‌మెంట్ అయిన "వంశీకృష్ణని". నిన్ను నిత్యం ఆరాధించే ప్రేమ పూజారిని. నీలో మెదిలే ప్రతి ఆలోచనా నా గురించే కావాలని ఆశిస్తూ—

—స్వీట్ డ్రీమ్స్
నీ వంశీ

ఆనందంతో ఓ కేక పెట్టాను. "ఏమిటో వేళ కాని వేళ మొద్దు నిద్ర. పైగా కేకలు" - అమ్మ అరుస్తుంటే మెలకువ వచ్చింది నాకు.

మనసంతా ఆహ్లాదంగా ఉంది. ఎంత తీయని కల! ఏమైనాసరే నేనే ధైర్యం చెయ్యాలి. లేకపోతే ఏదో మ్యాచ్ సెటిల్ చేసేస్తారు వీళ్ళు.

ప్రేమికులెప్పుడూ పిరికివాళ్ళు కాకూడదు. ఈ రోజే అతనితో మాట్లాడాలి.

త్వరత్వరగా తయారుకాసాగాను. ఉత్సాహంతో శరీరం, మనసు పరవళ్ళు తొక్కుతుంటే, "కాలేజీ లేదుగా ఇప్పుడెక్కడికి" అని అమ్మ అంటున్నా వినిపించుకోకుండా "ఫ్రెండ్ ఇంటికి" అని చెప్పేసి బయటకొచ్చేశాను.

* * *

బస్టాప్‌కి నే వెళ్ళేసరికి అతనప్పటికే అక్కడ నిలబడున్నాడు. అప్పటి వరకూ ధైర్యంగానే ఉన్నా



ఎదురుగా అతన్ని చూసేసరికి శరీరంలో వింత పులకరింపు. మెల్లగా పక్కకెళ్ళి నిల్చున్నాను. "ప్లీజ్!! ఓసారలా వెళదాం వస్తారా!" మెల్లగా అతనికే విని పించేలా అడిగాను.

విభ్రాంతితో చూస్తూ అంతలోనే నవ్వేసి అనుసరించాడతను. ఇద్దరం వెళ్ళి దగ్గరలోనే ఉన్న పార్కులో కూర్చున్నాము. జనం పెద్దగా లేరు. అక్కడక్కడ తప్ప.

"చెప్పండి" అన్నట్టు తమాషాగా నొసలెగరేశాడు.

తలెత్తి అతని వైపు చూసి తడబడుతూ తలవంచుకున్నాను బిడియంగా. అప్పటివరకూ ప్రిపేరయిన మేటరంతా ఎగ్జామ్ హాల్లోకి వెళ్ళగానే మెదడు బ్లాంక్ అయినట్టుంది నా పరిస్థితి.

నవ్వుతూ చూస్తున్నాడతను. 'ఇప్పుడు కూడా బుద్ధూలా అలా కూర్చోపోతే మాట్లాడొచ్చుగా' అని పించింది నాకు. అతని వాలకం చూస్తే అంతా నాచేత చెప్పించేలా ఉన్నాడు. పిలిచింది నేను కదా!

"నా పేరు శ్రుతి. మనం ఎప్పటి నుంచో ఒకరి కొకరం తెలుసు. నా గురించి మీ అభిప్రాయం" మెల్లగా అడిగాను.

అతనో నిముషం మౌనంగా ఆరాధనాపూర్వకంగా చూశాడు ప్రఫుల్లవదనంతో.

అర్థమైంది నాకు. ఎంత అందంగా కళ్ళతోనే జవాబు చెప్పాడనిపించింది.

"మావాళ్ళు మ్యాచ్‌లు చూస్తున్నారు. కానీ నా కిష్టం లేదు. నేను మిమ్మల్ని లైక్ చేస్తున్నాను. మీ అభిప్రాయం తెలుసుకుందామని ఇలా... ..." మెల్లగా రెప్పలు ఎత్తి అతన్ని సూటిగా చూశాను.

అతను చేతిలో నోట్‌బుక్ తెరిచి జేబులో పెన్ తీసి ఏదో వ్రాసి చదవమని ఇచ్చాడు

— 'నా పేరు వంశీ.

శ్రుతిగారు! మీరంటే నా కెంతో ఆరాధన. కానీ మిమ్మల్ని అందుకునే అర్హత లేనివాణ్ని. నాకు మిమ్మల్ని చూడని రోజు నరకంలా బాధిస్తోంది. ఒక్కోసారి పిచ్చి ఆవేశం వచ్చి మీతో చెప్పేయాలను కుంటాను. అంతలోనే నా అసహాయత నన్ను నిర్వీర్యుణ్ని చేస్తుంది. కారణం ఏమిటంటే నేను మాట్లాడటం చేతకాని దురదృష్టవంతుణ్ని. ఇప్పుడు చెప్పండి, మీరు నన్నిష్టపడతారా!" ఎప్పుడూ నవ్వుతూ ఉండే అతని కన్నులు చిత్తడి అయ్యాయి.

ఊహించని ఎదురుదెబ్బకి నా మనసు మూగబోయింది. సప్తస్వరాలు పలుకుతాయనుకున్న వైణికుడి చేతిలోని వీణ అపస్వరాలు పలుకుతుంటే వినలేనట్టు - విని భరించలేనట్టు కన్నులు మూసుకున్నాను. కలిసిన కంటిరెప్పల అంచుల నుంచి రెండు కన్నీటి బిందువులు రాలి అతను వ్రాసిన అక్షరాన్ని చెరిపేశాయి.

ఐదు నిమిషాల నిశ్శబ్దం తరువాత ఓ నిర్ణయాని కొచ్చినదానిలా మెల్లగా చెప్పాను —

"వంశీగారూ! మాటలతో హింసించే ప్రవృత్తి గల కొందరి కంటే మంచి మనసున్న మీరు అనర్హులెలా అవుతారు. మీకు మాటలు రావని ఎవరన్నారు? ఈ సంవత్సర కాలంగా మీ కన్నులు నా కెన్ని మూగ ఊసులు చెప్పాయో తెలుసా!

మీపై నేను ఇన్నాళ్ళుగా పెంచుకున్న అభిమానం ఒక్క మాటలో చెప్పగలిగేది కాదు. నేనంటే మీ కిష్టమే అని తెలుసు. ఎవరు కాదన్నా మన పెళ్ళి జరిగి తీరుతుంది!" నాకు తెలియకుండానే నా గొంతులో స్థిరత్వం తొంగిచూసింది.

అతని కన్నులు ఆరాధనా భావంతో మెరుస్తుంటే అలాగే చూస్తుండిపోయాడు.

ఐదు నిమిషాల తరువాత నోట్‌బుక్‌లో ఏదో వ్రాసి చూడమనిచ్చాడు.

"శ్రుతీ డియర్! నా కెంత ఆనందంగా ఉందో తెలుసా! ఆకాశంలో ఎగరాలని, నెమలిలా నాట్యం చెయ్యాలని సంతోషంతో ఎద పరవళ్ళు తొక్కుతూంది. నీలాంటి ప్రేమమూర్తి లభించటం నిజంగా నా పూర్వజన్మ సుకృతం. ఇప్పుడే ఇంట్లో డిక్లేర్ చెయ్యకు. నీ ఎగ్జామ్స్ అయ్యేవరకూ మన విషయం సీక్రెట్‌గా ఉంచు. పెద్దవాళ్ళు ఒప్పుకోపోయినా బ్రతకటానికి ఆధారం ఉంటుంది. నా జీవితాన్ని అందమైన మలుపు తిప్పబోతున్న నిన్నెలా అభినందించను" చదివి చిరునవ్వుతో చెప్పాను నేను —

"వంశీ! మీరే కాదు నేనూ అదృష్టవంతురాల్నే" అంటూ లేచి నిల్చున్నాను.

వంశీ చేతిని ముందుకు చాపాడు. అతని చేతిలో చెయ్యివేసి ముందుకు నడిచాను.

*


రచయిత చిరునామా

శ్రావణి
కేరాఫ్ సి.హెచ్. వెంకటేశ్వరరావు (పిటీవైవ్స్),
గాంధీనగర్,
విజయవాడ-3


## ప్రేమభాష్యం

ఒకరి నొకరు ప్రేమించండి. అయితే మీ ప్రేమను ఆంక్షాగ్రస్తం కానీయకండి.

మీ ఇరువురి ఆత్మల తీరాల మధ్య కదిలే సంద్రం కావాలి మీ ప్రేమ.

ఒకే ప్రేమ చషకాన్ని ఒంపుకునేకన్నా ఒకరి కొరకై ఒకరు వేర్వేరు మధు పాత్రలు నింపుకొనడంలోనే ప్రేమ ఉన్నది.

మీకున్నది చెరిసగం పంచుకు తినడంలో సౌఖ్యమున్నది. అలాగని ఒకే కంచంలో భుజించనక్కర్లేదు.

కలిసి సాగించే గాన నృత్యాలు సృజించే మేలిరకం హాయిలో ఏకాంత విరహ సౌఖ్యాన్ని విస్మరించరాదు సుమా! ఒకే శబ్ద సౌందర్యాన్ని నిర్మించే వీణ తీగలు సైతం విడివిడిగానే స్పందిస్తాయి కదా!

మనసులు విప్పి మాటలు వెదజల్లు కొనడం మహత్తరంగా వుంటుంది కానీ మనసిచ్చి పుచ్చుకోవడం అన్నది అర్థం లేని మాట. మనందరి ఉద్వేగాలకు ఉల్లాసాలకు మూలాధారమైన గుండె మనుగడ మన చేతిలో లేదన్నది నిజం కదా!

ఒకరికొకరు తోడయి సమస్యల సహరాను, సరదా సమీరాలను కలిసి స్వీకరించండి. అయితే నిలిపి ఉంచే మూలస్తంభాలు సైతం విడివిడిగానే నిలబడి వుంటాయి చూశారుగా!

ఆకుపచ్చని ఆరోగ్యాన్ని వెదజల్లే మర్రిచెట్టు, వేప వృక్షం పరస్పర ఛాయలో పరిమళాలు ఒలికించవు కదా!

ఉర్దూ మూలం: ఖలీల్ జిబ్రాన్

తెలుగుసేత: ఘంటశాల ఫణీమోహన్